ఖరీఫ్‌కు శ్రీకారం

- అడపాదడపా కురుస్తున్న వర్షాలు
- వరిసాగుకు పొలాలను సిద్ధం చేస్తున్న రైతులు
- స్వల్పకాలిక రకాల సాగుపై ఆసక్తి



ఖరీఫ్ సాగుకు పొలాన్ని చదును చేస్తున్న రైతులు

గరుగుబిల్లి: అడపాదడపా వర్షాలు కురుస్తుండడంతో అన్నదాతలు ఖరీఫ్‌కు సన్నద్ధమవుతున్నారు. మరో రెండు వారాల్లో రుతుపవనాలు రాష్ట్రంలో ప్రవేశించే అవకాశం ఉందని వాతావరణశాఖ ప్రకటించడంతో వరి నారుమడులు వేసేందుకు పొలాలను సిద్ధం చేస్తున్నారు. ఇప్పటికే తొలిదఫా వేసవి దుక్కులు పూర్తిచేసి మరోసారి పొలాలను దుక్కి చేసేందుకు చూస్తున్నారు. నవధాన్యాలు, పచ్చిరొట్ట పంటలు, సేంద్రియ ఎరువులు వేయడం, వరి విత్తనాల సేకరణలో రైతులు నిమగ్నమయ్యారు.

పొలం పనులలో బిజీ..

ఈ ఏడాది ఎండలు అధికంగా ఉండంతో సకాలంలో వర్షాలు కురుస్తాయో లేదో అని అన్నదాతలు ఆందోళన చెందారు. అయితే మే నెల రెండో వారం నుంచి అడపాదడపా చిరుజల్లులు కురుస్తుండడం అన్నదాతకు కాస్త ఊరటనిచ్చింది. గత రెండు రోజులుగా వర్షాలు కురవడంతో పొలాలను చదును చేసి, గట్లు వేసే పనుల్లో రైతులు బిజీగా ఉన్నారు.

స్వల్పకాలిక రకాలపై రైతుల మొగ్గు

వర్షాభావ పరిస్థితుల కారణంగా చివరి వరకు సాగు సజావుగా సాగుతుందో..లేదోనన్న అనుమానంతో ఈ ఏడాది స్వల్పకాలిక వరి రకాలను సాగుచేసేందుకు అన్నదాతలు ఆసక్తి చూపుతున్నారు. సాగునీటి వనరులు సమృద్ధిగా ఉన్న చోట్ల దీర్ఘకాలిక రకాలను సాగుచేసేందుకు సమాయత్తమవుతున్నారు. కురుపాం నియోజకవర్గంలో గరుగుబిల్లి, కురుపాం, జియ్యమ్మవలస, గుమ్మలక్ష్మీపురం, కొమరాడ మండలాలలో దాదాపు 1.60 లక్షల మంది రైతులున్నారు. సుమారు 85వేల ఎకరాల పంటభూమి అందుబాటులో ఉండగా.. అందులో 65 వేల ఎకరాల్లో వరిసాగు చేయనున్నారు. ఇందులో 25 శాతం భూమిలో స్వల్పకాలిక వరి రకాలను పండించేందుకు రైతులు ఆసక్తి చూపుతున్నారు.

వెదజల్లే పద్ధతే మేలు

ప్రస్తుతం ఉన్న వాతావరణ పరిస్థితుల్లో నారు పోసుకుని 25 రోజులపాటు పెంచి నాట్లు వేసుకునే కంటే వెదజల్లు పద్ధతిలో వరి విత్తనాలు వేసుకోవడం మేలని వ్యవసాయశాఖ సిబ్బంది సూచిస్తున్నారు.

మండలం	సాగువిస్తీర్ణం (ఎకరాలలో)
గరుగుబిల్లి	14,500
కురుపాం	12,200
గుమ్మలక్ష్మీపురం	8,700
కొమరాడ	12,400
జియ్యమ్మవలస	15,600

వెదజల్లే పద్ధతిలో సాగు చేస్తే పైరు నీటి ఎద్దడిని తట్టుకోవడంతో పాటు తక్కువ కాలంలోనే పంట చేతికొచ్చే అవకాశం ఉందని అంటున్నారు. అలాగే నారు పెంచడం, దమ్ము చేయడం, నాట్లు వేయడం వంటి పనులకు అయ్యే ఖర్చు కూడా ఆదా అవుతుందని అంటున్నారు.

క్లుప్తంగా

గుండెపోటుతో వీఆర్వో మృతి



ప్రభాకరరావు (ఫైల్)

జియ్యమ్మవలస: మండలంలోని పెదబుడ్డిడి, డంగభద్ర పంచాయతీలకు వీఆర్వోగా పనిచేస్తున్న చింతాడ ప్రభాకరరావు(42) శనివారం తెల్లవారు జామున గుండెపోటుతో మృతిచెందినట్లు తోటి సిబ్బంది తెలిపారు. మృతుని స్వగ్రామం సాలూరు మండలం బోగవలస. గుండెపోటు రావడంతో కుటుంబ సభ్యులు అతన్ని విజయనగరంలోని ఓ ప్రైవేటు హాస్పిటల్‌లో చేర్పించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందినట్లు తెలిపారు. మృతునికి భార్య, నలుగురు పిల్లలున్నారు. వీఆర్వో మృతికి సహచర సిబ్బంది నివాళులర్పించారు.

జోరందుకున్న జంఝావతి పనులు



దంగభద్ర వద్ద చురుకుగా సాగుతున్న జంఝావతి కుడికాలువ పనులు

కొమరాడ: మండలంలోని జంఝావతి కుడి కాలువ పనులు చురుకుగా సాగుతున్నాయి. గత ప్రభుత్వ హయంలో కాలువ పనుల కోసం నిధులు కేటాయించినప్పటికీ పనులు జరగలేదు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చిన తరువాత నిధులు మంజూరు చేయడంతో పనులు శరవేగంగా జరుగుతున్నాయి. జంఝావతి కుడి కాలువ ద్వారా పార్వతీపురం నియోజకవర్గంలో చినబొండపల్లి, ఎం.ఆర్.నగర్ తదితర గ్రామలకు సాగునీరు అందుతుంది.

చెరువు పనుల పరిశీలన



ఉపాధి అధికారులతో మాట్లాడుతున్న ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ అప్పలనాయుడు

మక్కువ: మండలంలో కన్నంపేట, కొయ్యానపేట, పనసభద్ర, శంబర, చప్పబుచ్చింపేట, కాశీపట్నం గ్రామాల్లో అమృత్ సరోవర్ పథకంలో భాగంగా చెరువుల్లో చేపడుతున్న పనులను ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ అప్పలనాయుడు, డీఆర్‌పీ శ్యామ్, ఉపాధి హామీ బృందం అధికారులు ఆదివారం పరిశీలించారు. ఆయా గ్రామాల్లో చేపట్టిన పనుల్లో నాణ్యత, పేర్లతో కూడిన శిలాఫలకాలు, చెరువు గట్లను పరిశీలించి, సిబ్బందికి పలు సూచనలు చేశారు.

తారాపురంలో పండగ సందడి



అమ్మవారి ఘటాలను ఊరేగిస్తున్న గ్రామస్తులు

రామభద్రపురం: గ్రామదేవతల ఉత్సవాల నేపథ్యంలో మండలంలోని తారాపురం గ్రామంలో పండగ సందడి నెలకొంది. గ్రామదేవతలైన చింతాలమ్మ, కొత్తమ్మ, బంగారమ్మ, టీకాలచ్చన్న, తారాదేవి అమ్మవార్ల పండగను ఈ నెల 5, 6, 7వ తేదీల్లో ఘనంగా నిర్వహించనున్నారు. దాదాపు 24 ఏళ్ల తర్వాత అమ్మవార్ల పండగ జరగడంతో వివిధ ప్రాంతాల్లో స్థిరపడిన వారంతా గ్రామస్తులు సొంతూరుకు చేరుకోవడంతో గ్రామంలో సందడి నెలకొంది. పండగకు మూడు వారాల ముందు అమ్మవార్లను గ్రామంలోకి తీసుకు వచ్చి, ఆ మూడు వారాల పాటు గ్రామంలో అమ్మవార్లను ఊరేగిస్తూ ప్రత్యేక పూజలు చేస్తారు. ఆ తర్వాత మూడో వారంలో వచ్చే సోమవారం తొలేళ్ల ఉత్సవం, మంగళవారం సిరిమానోత్సవం, బుధవా రం అమ్మవార్ల అనుపోత్సవం నిర్వహిస్తారు. సిరిమానోత్సవం రోజు కోలాటం, తప్పెటగుళ్ల ప్రదర్శనలతో పాటు, బిందెల డ్యాన్స్, పులివేషాలు వంటి పలు సాంస్కృతిక కార్యక్రమాలు చేపడతారు. ఉత్స వాల్లో భాగంగా 5వ తేదీన భాగవతం, 6వ తేదీన కండక్టర్ జాన్సీ, మాస్టర్ రమేష్ ట్రూప్‌తో మెగా డ్యాన్స్ ఈవెంట్, సత్య హరిశ్చంద్ర నాటకం కార్యక్రమాలు నిర్వహిస్తారు. ఈ పండగకు దాదాపు రెండు లక్షల మంది వరకు భక్తులు వచ్చి, అమ్మవార్లను దర్శించుకుంటారని ఉత్సవ కమిటీ సభ్యులు చెబుతున్నారు.

కూలిన రేకుల షెడ్



కూలిన రెకుల షెడ్డు

పార్వతీపురం టౌన్: పట్టణంలో ఆదివారం సాయంత్రం భారీ ఈదురు గాలులతో కురిసిన వర్షం బీభత్సం సృష్టించింది. కొత్తవలస కాలనీ నాయుడువీధి చివరిలో బీహార్‌కు చెందిన ఓ కుటుంబం నివాసం ఉంటున్న రేకుల షెడ్డు గాలికి పూర్తిగా కూలిపోయింది. అలాగే కొత్తవలస కాలనీలో ఈదురు గాలులకు కేపీఎం పాఠశాల సమీపంలో చెట్టు నేలకొరిగి విద్యుత్ వైర్లపై పడడంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. విద్యుత్ శాఖ సిబ్బంది, మున్సిపల్ సిబ్బంది స్పందించి మరమ్మతులు చేపట్టి విద్యుత్ సరఫరా పునరుద్ధరించారు.

ఎంపీటీసీ కుటుంబానికి పరామర్శ



మృతుని కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

భామిని: మండలంలోని బత్తిలి–1 ఎంపీటీసీ సభ్యురాలు నిమ్మల సుశీల(65) ఈ నెల 2న మృతి చెందడంతో వైస్ ఎంపీపీ బోనగడ్డి ధర్మారావు ఆదివారం మృతురాలి కుటుంబ సభ్యులను పరామర్శించారు. సుశీల చిత్రపటం వద్ద నివాళులర్పించారు. ఆమె మృతికి గల కారణాలను అడిగి తెలుసుకుని ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. పరామర్శించిన వారిలో బాలేరు, నులకజోడు, బత్తిలి ఎంపీటీసీలు కొత్తకోట చంద్రశేఖర్, బూస బాలకృష్ణ, టింగ అన్నాజీరావు, వైఎస్సార్‌సీపీ నాయకులు గెల్లంకి రమేష్, మేడిబోయిన చలపతి, బొడ్డేపల్లి ప్రసాద్, కాగితాపల్లి కృష్ణారావు, వలరౌతు రామారావు ఉన్నారు.

మనబడి నాడు నేడు పనులు వేగవంతం చేయాలి



ఆర్.వెంకంపేటలో పనులు పరిశీలిస్తున్న ఎంఈఓ జి సూరిదేముడు

సీతానగరం: పాఠశాలల పునఃప్రారంభానికి సమయం ఆసన్నమవడంతో మండలంలో మన బడి నాడు నేడు పనులు వేగవంతంగా పూర్తి చేయాలని ఎంఈఓ జి సూరిదేముడు కోరారు. ఈ మేరకు ఆదివారం ఆర్.వెంకంపేట ఉన్నత పాఠశాల ఆవరణలో నాడు నేడు పథకం ఫేజ్–2 నిధులతో అదనపు భవనాలు, భవనాలకు మరమ్మతు పనులను ఏఈ నారాయణస్వామితో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నాడు నేడు పథకం ఫేజ్ –2 నిధులతో ఆర్ వెంకంపేటలో రూ 35 లక్షల వ్యయంతో అదనపు గదుల నిర్మాణం , పాత భవనాలకు మరమ్మతులు చేయాలని సంకల్పించామన్నారు. ఈ మేరకు పనులు ప్రారంభించి ఏడాది కావస్తున్నా ఇంతవరకూ పూర్తి కాకపోవడంతో భవిష్యత్తులో విద్యార్థులు ఇబ్బందులు పడాల్సి వస్తుందన్నారు. ఎస్ఎంసీ కమిటీ చైర్మన్ పర్యవేక్షణలో పాఠశాలల పనులు నిర్దేశించిన గడువులోగా పూర్తి చేసి విద్యాభివృద్ధికి నిర్వాహకులు తోడ్పడాలని కోరారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం భాస్కరరావు, సహోపాధ్యాయులు పాల్గొన్నారు.

పంపిణీకి సిద్ధంగా మొక్కలు



నర్సరీలో పంపిణీకి సిద్ధంగా ఉన్న మొక్కలు

సీతానగరం: ప్రభుత్వం అమలు చేస్తున్న జగనన్న పచ్చతోరణంలో భాగంగా అన్నిగ్రామాల చెరువు గట్లుపైనా డీపట్టా భూముల్లో మొక్కలు నాటడానికి అవసరమైన నారు తయారు చేశామని ఎంపీడీఓ ఎంఎల్ఎస్ ప్రసాద్ అన్నారు. ఈ మేరకు ఆదివారం ఆయన నర్సరీలోని మొక్కలను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మండలంలోని గ్రామాల్లో ఉపాధి హామీ పథకం–సోషల్ ఫారెస్ట్ శాఖల ఆధ్వర్యంలో ఉత్పత్తి చేసిన మొక్కలు ప్రభుత్వ, ప్రైవేట్ స్థలాల్లో నాటేందుకు పంపిణీకి సిద్ధం చేస్తున్నామని అన్నారు. ప్రభుత్వనిధులతో అంటిపేట వద్ద ఉన్న నర్సరీలో నీడనిచ్చే మొక్కలతోపాటు ఔషధ మొక్కలు, పూలజాతి, ఫల జాతికి చెందిన మొక్కలు త్వరలో పంపిణీ చేస్తామని తెలిపారు. ఇప్పటికే 36 కిలోమీటర్ల పొడవునా బీటీ రోడ్లకు ఇరువైపులా మొక్కలు నాటడం వల్ల మండుటెండ కాచిన వేసవిలో పాదచారులకు నీడనిస్తున్నాయని తెలియజేశారు.

రక్తదానంతో ప్రాణదానం

పాలకొండ రూరల్: రక్తదానంతో ఆపదలో ఉన్న వారికి ప్రాణదానం చేయవచ్చనే విషయాన్ని ప్రతి ఒక్కరూ గ్రహించాలని హెల్పింగ్ హ్యాండ్స్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి వారాడ రాజశేఖర్, వల్లూరి జయిరాం తదితరులు అన్నారు. పాలకొండ పట్టణంలోని సాహితీ జూనియర్ కళాశాలలో ఆదివారం మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా 52 యూనిట్ల రక్తాన్ని సేకరించి శ్రీకాకుళం రెడ్‌క్రాస్ బ్లడ్‌బ్యాంక్‌కు అందజేశారు. తలసేమియాతో బాధపడుతున్న చిన్నారులకు ఈ రక్తాన్ని అందించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

కవిత్వంపై మక్కువ పెంచేలా రచనలు

బొబ్బిలి: తెలుగు కవిత్వంపై మక్కువ పెంచేలా రచనలు చేయాలని వక్తలు కోరారు. స్థానిక శ్రీ కళాభారతి మున్సిపల్ ఆడిటోరియంలో తెలుగు వెలుగు సాహిత్య వేదిక ద్వితీయ వార్షికోత్సవం ఆదివారం సాయంత్రం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి హాజరైన కవులు, రచయితలు, సాహిత్యాభిమానులు మాట్లాడుతూ సమాజాన్ని చైతన్యం చేసే రచనలు చేయాలని, ముఖ్యంగా యువత సాహిత్యంపై ఇష్టం పెంచుకోవాలని సూచించారు. భావితరాలకు తెలుగు సాహిత్యం గొప్పతనం వివరించేలా, వారిలో స్ఫూర్తి నింపేలా మన రచనలు, కవిత్వం ఉండాలని తెలిపారు. అంతకుముందు కేక్ కట్ చేసి, ఆడిటోరియం ఆవరణలోని తెలుగుతల్లి విగ్రహానికి పూలమాలలు వేశారు. కార్యక్రమంలో వేదిక అధ్యక్షుడు పీఆర్ ఎస్ఎస్ఎన్ మూర్తి, చాంబర్ ఆఫ్ కామర్స్ ప్రతినిధి నంబియార్ వేణుగోపాలరావు, కవి మీసాల చినగౌరినాయుడు, గ్రీన్‌బెల్ట్ సొసైటీ సీఈఓ ఎస్‌వీ రమణమూర్తి, నటసమాఖ్య అధ్యక్షుడు కర్రి సత్యనారాయణ, తెలుగు వెలుగు కార్యదర్శి కె.రామకృష్ణ పాల్గొన్నారు.

ఆంద్రకు జ్వరమొచ్చింది..

మెంటాడ: మండలంలోని ఆంద్ర, లోతుగెడ్డ గ్రామా ల్లో విషజ్వరాలు ప్రబలుతున్నాయి. ఆయా గ్రామాలకు చెందిన కుంచె పైడపునాయుడు, దాసరి రామునాయుడు, మారోతు కనకం, బండి రేవంత్‌కుమార్, సత్తరపు రాములమ్మ, తెమ్మ సింహాచలంతో పాటు మరికొంత మంది జ్వరం బారినపడి, ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. గ్రామంలో పారిశుద్ధ్యం లోపించడం వల్లే ఈ దుస్థితి నెలకొందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వీధులు, రోడ్లపై ఎక్కడపడితే అక్కడ చెత్తాచెదారం పేరుకుపోవడం, కాలువల్లో పూడికలు విపరీతంగా ఉండిపోవడంతో ఆయా ప్రాంతాలు దోమలకు నిలయంగా మారా యి. దీంతో మలేరియా, డెంగీ వంటి జ్వరాలు వస్తున్నాయని బాధితులు చెబుతున్నారు.

చల్లపేటలోనూ ఇదే పరిస్థితి..

మండలంలోని చల్లపేట ఆస్పత్రి పరిధిలోని కొండలింగాలవలస, తదితర గిరిజన గ్రామాల్లో కూడా ఇదే పరిస్థితి నెలకొందన్నారు. అక్కడి వారు కొంతమంది జ్వరం బారినపడి మంచానపడ్డారు.

భక్తిశ్రద్ధలతో హోమం



హోమాలు చేస్తున్న భక్తులు

గరుగుబిల్లి: మండల కేంద్రంలోని షిర్డీసాయి మందిరంలో ఆదివారం ప్రత్యేక హోమాలు నిర్వహించారు. ఆలయ 21వ వార్షికోత్సవం, 17వ అఖండ సాయినామ సప్తాహం కార్యక్రమంలో భాగంగా దేవీ సహిత జైగురుదత్త హోమాలు నిర్వహించారు. అలాగే ఈ నెల 6,7,8 తేదీల్లో భిక్షయాత్ర, 8న బాబా మూలవిరాట్‌కు క్షీరాభిషేకం, విశేషపూజలు, పూర్ణాహుతి తదితర పూజా కార్యక్రమాలు చేపట్టనున్నట్లు తెలిపారు. విజయవాడకు చెందిన భజన బృందం సాయినామ సంకీర్తన చేస్తున్నారు. సాయినస్తాహ ముగింపు సందర్భంగా ఈనెల 8న ఆలయ ప్రాంగణంలో అన్నసమారాధన చేయనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

ఆర్‌బీకేల్లో అందుబాటులో విత్తనాలు



కొండాపురం ఆర్‌బీకేకి చేరిన విత్తనాలు

పాలకొండ: ఖరీఫ్‌లో రైతులకు అవసరమైన వరి విత్తనాలు రైతుభరోసా కేంద్రాలకు చేరాయి. అగ్రికల్చర్ అసిస్టెంట్లు, ఆర్‌బీకే వలంటీర్ల ద్వారా విత్తనాలను రైతులకు పంపిణీ చేసేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. మండలానికి సంబంధించి సుమారు 5వేల క్వింటాళ్ల విత్తనాలు అందుబాటులో ఉంచామని ఏఓ వాహిని తెలిపారు. విత్తనాలు కావాల్సిన రైతులు ఆర్‌బీకేల్లో వివరాలు నమోదు చేసుకోవాలని కోరారు. 30 శాతం రాయితీపై విత్తనాలు అందజేయనున్నట్లు చెప్పారు. వీటిని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

వైభవంగా జ్యేష్టపౌర్ణమి పూజలు



పూజలందుకుంటున్న ఉత్సవమూర్తులు

పాలకొండ రూరల్: పట్టణంలోని జగన్నాథ స్వామి ఆలయంలో స్వామివారి రథయాత్ర అంకురార్పణ కార్యక్రమాలు ఆదివారం వైభవంగా నిర్వహించారు. జ్యేష్ఠపౌర్ణమిని పురస్కరించుకుని సుభద్ర, బలభద్ర, జగన్నాథ స్వామికి విశేష పూజలు, అభిషేకాలు చేశారు. స్వామివారి నేత్రాలను పుణ్య జలాలతో అభిషేకించారు. స్వామివారి పూజా విశేషాలను, ఆలయ చరిత్రను అర్చకులు మఠం విశ్వనాథ దాస్, జయరాం దాస్ భక్తులకు వివరించారు. అనంతరం స్వామివారిని ఉక్కగదిలోకి తీసుకువెళ్లారు. ఈ నెల 19 వరకు స్వామివారు అక్కడ సేదతీరుతారు. 20న తిరిగి భక్తులకు పునఃదర్శనమిస్తారు. అప్పటి నుంచి పది రోజుల పాటు రథయాత్ర ఉత్సవం జరుగుతుందని ఆలయ అధికారులు తెలిపారు.

సృజనాత్మకత పెంపొందించుకోవాలి



కాగితపు బొమ్మలు తయారు చేస్తున్న విద్యార్థులు

భామిని: విద్యార్థులు సృజనాత్మకతను మెరుగుపర్చుకోవాలని గ్రంథాలయాధికారి ఎ.సునీత అన్నారు. స్థానిక శాఖా గ్రంథాలయంలో కొనసాగుతున్న వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా ఆదివారం విద్యార్థులతో కాగితపు బొమ్మలు తయారు చేయించారు. విద్యార్థులు కాగితాలతో రకరకాల బొమ్మలు చేసి వారిలోని సృజనాత్మకతను ప్రదర్శించారు.

కొత్త విషయాలు నేర్చుకోవాలి..

పాలకొండ రూరల్: కొత్త విషయాలను నేర్చుకునేందుకు విద్యార్థులు ఆసక్తి చూపాలని గ్రంథాలయ ఇన్‌చార్జి బబ్బూరి గణేష్‌బాబు అన్నారు. వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా స్థానిక శాఖా గ్రంథాలయంలో ఆదివారం విద్యార్థులకు ఫ్యాషన్ డిజైనింగ్‌పై అవగాహన కల్పించారు. వ్యర్థాలతో కళాకృతులను ఏ విధంగా రూపొందించవచ్చో ఫ్యాషన్ డిజైనర్ ప్రియాంక విద్యార్థులకు వివరించారు. అనంతరం కాగితాలను ఉపయోగించి చిన్నారులతో బొమ్మలు తయార చేయించారు.

దళితుల అభ్యున్నతికి కృషి



దళిత యువ సమ్మేళనానికి బయలుదేరి వెళ్తున్న యువత

పాలకొండ రూరల్: దళితుల అభ్యున్నతికి నిరంతరం కృషి చేస్తామని ఆల్ ఇండియా దళిత రైట్స్ ఫోరమ్ పాలకొండ డివిజన్ అధ్యక్షుడు బత్తిన మోహనరావు అన్నారు. విశాఖలో జరుగుతున్న దళిత యువ సమ్మేళన కార్యక్రమానికి డివిజన్ పరిధిలోని యవత ఆదివారం బయలుదేరి వెళ్లారు. ఈ సందర్భంగా మోహనరావు మాట్లాడుతూ.. దళితుల హక్కుల సాధన, ఉద్యోగ అవకాశాల కల్పన, తమపై జరుగుతున్న దాడుల నుంచి చట్టబద్ధమైన రక్షణ వంటి అంశాలను ప్రస్తావించారు. యువ సమ్మేళనం ద్వారా తమ న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లనున్నట్లు చెప్పారు.

ఆటో డ్రైవర్‌పై దాడి

పాలకొండ రూరల్: పట్టణంలోని ఆర్టీసీ కాంప్లెక్స్ సమీపంలో ఓ ఆటో డ్రైవర్‌పై కొందరు యువకులు కత్తితో దాడి చేశారు. బాధితుని కథనం మేరకు.. పట్టణానికి చెందిన శ్రీను ఆటో నడుపుతూ జీవనం సాగిస్తున్నాడు. ఆదివారం కోటదుర్గమ్మ దేవస్థానం జంక్షన్ నుంచి ఆటోపై కాంప్లెక్స్ వైపు వస్తుండగా.. కొంతమంది యువకులు కాంప్లెక్స్ వెళ్లేందుకు ఆటో ఎక్కారు. ఒక్కొక్కరికి రూ.10లు అవుతుందని చెప్పడంతో వారు సరే అన్నారు. అయితే దిగేటప్పుడు వారు రూ.200 ఇవ్వడంతో తన వద్ద చిల్లర లేదని, చిల్లర తీసుకువచ్చి ఇవ్వాలని శ్రీను వారితో చెప్పాడు. ఈ క్రమంలో వారి మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. అంతలో ఓ యువకుడు తన వద్ద ఉన్న చిన్న కత్తితో ఆటో డ్రైవర్‌పై దాడి చేశారు. దీంతో అతనికి పొట్ట భాగంలో గాయమైంది. పారిపోయేందుకు ప్రయత్నించిన యువకులను స్థానికులు పట్టుకుని పోలీసులకు అప్పగించారు. బాధితుడు పాలకొండ ఏరియా ఆస్పత్రిలో చికిత్స తీసుకుని, అనంతరం పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

21మందికి నేత్ర వైద్యపరీక్షలు



పెదపెంకిలో వైద్య పరీక్షలు చేస్తున్న అప్తాలమిక్ కిరణ్

బలిజిపేట: మండలంలోని పెదపెంకిలో ఆదివారం ఏర్పాటు చేసిన ఉచిత నేత్ర వైద్యశిబిరంలో 21మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. పెదపెంకి నేతాజీ గ్రంథాలయ వ్యవస్థాపకుడు ఈర్లసంజీవనాయుడు ఆధ్వర్యంలో రెండవ నంబర్ ప్రాథమిక పాఠశాల వద్ద నిర్వహించిన వైద్యశిబిరంలో 21మందికి ఉచిత నేత్ర వైద్య పరీక్షలు నిర్వహించి 14మంది శస్త్ర చికిత్సకు ఎంపిక చేసినట్లు అప్తాలమిక్ కిరణ్ తెలిపారు. శస్త్రచికిత్సలకు ఎంపిక చేసిన వారిని విజయనగరంలోని వెంకట పుష్పగిరి హాస్పిటల్‌కు తీసుకువెళ్లి శస్త్ర చికిత్సలు పూర్తిచేసిన తరువాత తిరిగి గ్రామానికి చేరుస్తామన్నారు. కార్యక్రమంలో ఎం.రాంబాయమ్మ, ఎస్.హరి, ఎం.సాయి, ఈ.మధు తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికే గడపగడపకు

- ఎమ్మెల్యే అలజంగి జోగారావు



గడపగడపకు సంక్షేమ పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే జోగారావు

పార్వతీపురంటౌన్: ఎన్నో ఏళ్లుగా మూలుగుతున్న సమస్యల పరిష్కారమే గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ఉద్దేశమని ఎమ్మెల్యే అలజంగి జోగారావు అన్నారు. ఈ మేరకు నిర్వహిస్తున్న గడపగడపకు మనప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా పార్వతీపురం మండలంలోని తాళ్లబురిడి గ్రామంలో అధికారులు, ప్రజాప్రతినిధులతో కలిసి ఆదివారం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామంలోని ప్రతి ఇంటికి వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించారు. ప్రజ ల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వార్డుల్లో కొన్ని ప్రాంతాల్లో రోడ్లను పరిశీలించి ప్రణాళికలు సిద్ధం చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జోగారావు మాట్లాడు తూ అర్హతే ప్రామాణి కంగా పార్టీలు, కులాలు, వర్గా లు, ప్రాంతాలకు అతీతంగా ప్రభుత్వ సంక్షేమ పథకా లు అందిస్తున్నామన్నారు. రాష్ట్రప్రభుత్వం సంక్షేమా న్ని, అభివృద్ధిని సమపాళ్లలో అందిస్తోందని చెప్పారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చేతల ప్రభుత్వమని సీఎం ఎన్నికల హామీల్లో ఇచ్చిన నవరత్నాల వాగ్దానాలను మాట తప్పకుండా అమలు చేస్తున్నారన్నారు.

ప్రతిపక్షాల అసత్య ప్రచారం

ప్రభుత్వం చేసే అభివృద్ధిని ఓర్వలేక ప్రతిపక్షాలు అసత్య ప్రచారం చేస్తున్నాయని దుయ్యబట్టారు. వచ్చే రెండేళ్ల కాలంలో రాష్ట్రం మరింత అభివృద్ధి చెందుతుందని ఆశాభావం వెలిబుచ్చారు. గ్రామంలో కొన్ని ప్రాంతాల్లోని రోడ్లు, కాలువలు నిర్మాణం చేపట్టాలని వార్డువాసులు ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేయగా స్పందించిన స్పందించిన ఆయన మండల అధికారులతో మాట్లాడి సాధ్యమైనంత త్వరలో రోడ్లు, కాలువలు మంచినీటి కుళాయిల ఏర్పాటుకు చర్యలు చేపడతామని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ మజ్జి శోభారాణి, జెడ్పీటీసీ బలగ రేవతమ్మ, ఏఎంసీ చైర్‌పర్సన్ భాగ్యలక్ష్మి, వైస్ ఎంపీపీ సిద్దా జగన్నాథరావు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బొమ్మి రమేష్, ఆత్మచైర్మన్ యాంద్రాపు తిరుపతిరావు, బి.కృష్ణమూర్తి, మడక విశ్వనాథం, యాంద్రాపు శ్రీరాములు నాయుడు, వి.గురురాజు, ఎం.సత్యంనాయుడు సర్పంచ్‌లు ఎంపీటీసీ సభ్యులు, స్టేట్‌కార్పొరేషన్ డైరెక్టర్లు, ఏఎంసీ డైరెక్టర్లు, కోఆప్షన్ సభ్యులు, నాయకులు, కార్యకర్తలు జేసీఎస్ కన్వీనర్, సచివాలయం కన్వీనర్లు, గృహసారథులు, సచివాలయం ఉద్యోగులు, వలంటీర్లు, స్థానిక ప్రజలు తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.